సాక్షి
అన్నమయ్య జిల్లా
మంగళవారం । 12 । మార్చి । 2024



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ మంగళ (సా॥)	సహర్ బుధ (ఉ॥)
రాజంపేట	6.29	5.03
రాయచోటి	6.29	5.03
మదనపల్లి	6.31	5.04
పీలేరు	6.31	5.04



చిట్టీల పేరుతో మోసం

మదనపల్లె పట్టణంలో ప్రైవేట్‌గా చిట్టీలు నిర్వహిస్తున్న వ్యక్తులు తమను మోసం చేశారంటూ బాధితులు వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించిన ఘటన సోమవారం జరిగింది. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.150	రూ.200
రెండోరకం	రూ.80	రూ.148



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 97 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	273	410
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 2,049.00 కిలోలు

పుట్టిన గడ్డపై మమకారం..
ప్రగతికి సహకారం



వైఎస్సార్ మెమోరియల్ పార్కు వద్ద కళాకృతులు



ఆదిత్యబిర్లా గార్మెంట్స్‌లో మహిళలను వివరాలు అడుగుతున్న సీఎం



వైఎస్సార్ మెమోరియల్ పార్కు వద్ద...



మహాత్మాగాంధీ విగ్రహానికి సీఎం పుష్పాంజలి



వైఎస్సార్ సర్వజన ఆసుపత్రి వద్ద అధికారులు, నాయకులతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

- పులివెందులలో బిజీబిజీగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- రూ.861.84కోట్లతో చేపట్టిన నిర్మాణాలు ప్రారంభం

పులివెందుల : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ జిల్లా పులివెందుల నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు నిర్వహిస్తూ సోమవారం బిజీబిజీగా గడిపారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులను ఆత్మీయంగా పలకరిస్తూ పేరుపేరునా యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. దారిపొడవునా తన కోసం వేచిచూస్తున్న ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. సీఎం పర్యటన పులివెందులలోని నాయకులు, అభిమానులు, ప్రజలకు ఉత్సాహాన్ని నింపింది.

అభివృద్ధికి నిలువెత్తు నిదర్శనంగా పులివెందుల...

అభివృద్ధికి నిలువెత్తు నిదర్శనంగా పులివెందులను తీర్చిదిద్దనున్నట్లు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. పుట్టిన గడ్డపై ఉన్న మమకారం ఎప్పటికీ తరగదని, నిరంతరం అభివృద్ధి కొనసాగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలో రూ.861.84 కోట్లతో చేపట్టిన పలు నిర్మాణాలకు ప్రారంభోత్సవం చేశారు. రూ.500 కోట్లుతో డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ మెడికల్ కళాశాలను నెలకొల్పారు. అరటి రైతులకు ఉపయోగకరమైన బనానా ప్రాసెసింగ్ యూనిట్ రూ.20.15కోట్లతో నిర్మించారు. పులివెందులలో 2.79 ఎకరాల్లో రూ.38.15 కోట్లతో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ మినీ సెక్రెటేరియేట్ కాంప్లెక్స్ భవనాన్ని సీఎం ప్రారంభించారు.

మహాత్మగాంధీ, వైఎస్సార్ విగ్రహాల ఆవిష్కరణ...

పులివెందుల మోడల్ టౌన్ ప్రాజెక్టులో భాగంగా పట్టణ నడిఒడ్డున రూ.80లక్షలతో నిర్మించిన గాంధీ జంక్షన్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సర్కిల్‌లో అత్యంత సుందరంగా మహాత్మాగాంధీ విగ్రహం ఏర్పాటు చేశారు. మరో రూ.70లక్షలతో వైఎస్సార్ జంక్షన్ నెలకొల్పారు. డాక్టర్ వైఎస్సార్ విగ్రహాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. పులివెందుల మోడల్ టౌన్ ప్రాజెక్టులో భాగంగా రూ.65.99కోట్లతో 100 ఎకరాల్లో ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్సార్ ఉలిమెల్ల లేక్ ఫ్రంట్ అద్భుతంగా దర్శనమిస్తోంది. పారిశ్రామిక అభివృద్ధిలో భాగంగా రూ.175కోట్ల పెట్టుబడితో నెలకొల్పిన ఆదిత్య-బిర్లా గార్మెంట్స్ యూనిట్‌ను సీఎం ప్రారంభించారు. ఇడుపులపాయ ఎస్టేట్‌లో రూ.39.13 కోట్లతో 16 ఎకరాల్లో నిర్మించిన డాక్టర వైఎస్సార్ మెమోరియల్ పార్క్‌ను జాతికి అంకితం చేశారు.

అదే వినయం...అదే ఆప్యాయత...

పులివెందుల గడ్డపై కాలుమోపిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇక్కడి ప్రజానీకం, నాయకుల పట్ల అదే వినయం, ఆప్యాయతను చూపించారు. మీ అందరి అభిమానం, దీవెనలే ఈ స్థాయికి కారణమని చెప్పడం విశేషం. డిప్యూటీ సీఎం అంజద్‌బాషా,మంత్రి ఆదిమూలపు సురేష్, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, కలెక్టర్ విజయరామరాజు, ఎస్పీ సిద్దార్థ్‌కౌశల్, పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి, ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ చిన్నప్ప, బలరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బనానా ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలిస్తున్న సీఎం



జయమ్మ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద...



జయమ్మ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద వృద్ధులను పలకరిస్తూ..



అభిమాన నాయకుని కోసం వేచి చూస్తున్న ప్రజలు

న్యూస్‌రీల్

13న ప్రధానమంత్రి సురాజ్ వర్చువల్ సమావేశం

రాయచోటి : ఈనెల 13వ తేదిన భారత ప్రధాన మంత్రి సు-రాజ్ వర్చువల్ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా రాయచోటి షెడ్యూల్డ్ కులాల సేవా సహకార సంస్థ కార్యనిర్వాహక సంచాలకులు డాక్టర్ హెచ్.వెంకటసుబ్బయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భారత ప్రభుత్వ సూచనల మేరకు కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ ఆధ్వర్యంలో 13న సాయంత్రం 4 గంటలకు రాయచోటి కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో ఈ వర్చువల్ సమావేశం ఉంటుందన్నారు. కేంద్ర పథకాల లబ్ధిదారులతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని, ఇందులో భాగంగా ప్రధాన మంత్రి నరేంద్రమోడీ వర్చువల్ విధానంలో ముఖాముఖిగా లబ్ధిదారులతో మాట్లాడతారని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

రాయచోటి: అన్నమయ్య జిల్లాలో సోమవారం ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. సోమవారం జిల్లాలో 54 పరీక్షా కేంద్రాలలో 9868 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉంది. వీరిలో 549 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి కృష్ణయ్య చెప్పారు. రెండవ సంవత్సరం ఇంటర్ జనరల్ పరీక్షలకు 8825 మంది విద్యార్థులకు గాను 462 మంది, ఒకేషనల్ పరీక్షకు 1043 మంది విద్యార్థులకు 87 మంది గైర్హాజరైనట్లు డీవిఈఓ తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి టౌన్ : జిల్లా వ్యాప్తంగా ఉన్న కస్తూరిబా గురుకుల పాఠశాలలో 6, 11వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాష్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 12వ తేది నుంచి ఏప్రిల్ 11వ తేది వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మొత్తం 22 కస్తూరిబా గురుకుల పాఠశాలలో 6, 11వ తరగతిలో ప్రవేశాలు ఉన్నట్లు తెలిపారు. అలాగే 7,8,9వ తరగతిలలో ఖాళీ ఉన్న వాటికి కూడా దరఖాస్తులు స్వీరిస్తున్నట్లు తెలిపారు.అనాథలు, బడి బయటి పిల్లలు, డ్రాపౌట్లు, దారిద్ర్యరేఖకు దిగువ ఉన్నవారు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు, వలస కార్మికులు అర్హులన్నారు. వివరాల కోసం 18004258599 నంబర్లో సంప్రదించాలని కోరారు.

గ్రేడ్-1 మున్సిపాలిటీగా పులివెందుల అప్‌గ్రేడ్

పులివెందుల : పులివెందుల మున్సిపాలిటీని గ్రేడ్-2 నుంచి గ్రేడ్-1గా ప్రభుత్వం అప్‌గ్రేడేషన్ చేసింది. ఈ మేరకు మున్సిపల్ శాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. పులివెందుల మున్సిపాలిటీ గత ఐదు సంవత్సరాల ఆదాయ, వ్యయాలను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకుంది. మున్సిపాలిటీ స్థాయి పెరగడం వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వివిధ రకాల పథకాల పేరిట నిధుల విడుదల పెరుగుతుంది.

గంగమ్మ జాతర.. జనసంద్రమాయెర !

- అమ్మవారి దర్శనానికి తరలివచ్చిన లక్షలాది మంది భక్తులు
- జాతరలో ప్రత్యేక ఆకర్షణగా చాందినీ బండ్లు
- డీఎస్పీ మహబూబ్ బాషా ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు



అమ్మవారి దర్శనానికి క్యూ లైన్‌లో వేచి ఉన్న భక్తులు (ఇన్‌సెట్) చాగలగుట్టపల్లె గంగమ్మ దేవత ఉత్సవ విగ్రహ మూర్తి

లక్కిరెడ్డిపల్లె : రాయలసీమ జిల్లాల్లోనే ప్రసిద్ధిగాంచిన అనంతపురం గంగమ్మ దేవత జాతర సోమవారం వైభవంగా జరిగింది. లక్షలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ ఆవరణం జనసంద్రమైంది. నలుదిక్కులా గంగమ్మ నామస్మరణ మార్మోగింది. దారులన్నీ అమ్మవారి సన్నిధికే అన్నట్లు వేలాది వాహనాలు జాతర వైపు సాగాయి. గంగమ్మ దేవత కరుణించి కాపాడవమ్మా అంటూ భక్తులు అమ్మ వారిని వేడుకున్నారు.

బాణా సంచా నడుమ జాతరకు చేరిన అమ్మవారు ..

అమ్మ వారి పుట్టినిల్లు అయిన చాగలగుట్టపల్లెలో ఆదివారం రాత్రి నుంచి జాగారం కొనసాగింది. అమావాస్య నాడు అర్ధరాత్రి దాటిన తర్వాత అమ్మవారిని బయటకు తీసుకువచ్చారు. ఆ క్షణం.. ఆ ప్రాంతం గంగమ్మ దేవత నామస్మరణతో మారుమోగిపోయింది.లక్కిరెడ్డిపల్లె సి.ఐ.జీవన్ గంగనాథబాబు, గాలివీడు ఎస్.ఐ.తన సిబ్బందితో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తిని వెండి పల్లకిలో తెల్లవారుజామున 3 గంటలకే అప్పలరాజు గారిపల్లె మీదుగా మర్రిచెట్టు మార్గానా జాతరకు చేర్చారు. లక్కిరెడ్డిపల్లె ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి అమ్మవారికి చాగలగుట్టపల్లెలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు అనంతపురం గంగమ్మ దేవతను దాతల సహకారంతో గంగమ్మ తల్లి సేవాసమితి వారు ప్రత్యేకంగా అలంకరించారు. వేకువ జామునే అమ్మవారికి ఆలయ పూజారులు చెల్లు వంశీయులు సూరి,శ్రీనివాసులు,మునీంద్ర కుటుంబ సభ్యులు అభిషేకాలు, అర్చనలు చేసి అమ్మ వారి దర్శన భాగ్యాన్ని కల్పించారు. ఆలయ కమిటీ ఛైర్మెన్ మురికినాటి రెడ్డెయ్య,ఆలయ ఈ.ఓ రవీంద్ర రాజు,సర్పంచ్ వెంకటనారాయణ రెడ్డి,ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన కుంకుమ, చాందీని బండ్లు...

జాతరలో చాందీని బండ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.వేలాదిగా కాలినడకన జాతరకు తరలివచ్చిన భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.జాతరకు అధిక సంఖ్యలో చాందినీ బండ్లు తరలిరావడంతో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతగానో అలరింపజేశాయి.దీంతో పాటు జబర్దస్త్, రేలారే నూలా,చెక్క భజన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

చల్లంగా చూడు తల్లీ
– ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

అనంతపురం గంగమ్మ తల్లీ.. ప్రజలందరినీ చల్లంగా చూడు తల్లీ.. అంటూ వైఎస్సార్ సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మోహన్ రెడ్డి ప్రార్థించారు. జాతర సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు మాజీ ఎమ్మెల్యే మోహన్ రెడ్డి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు.



అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకువెళ్తున్న మోహన్ రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

డీఎస్పీ మహబూబ్ బాషా ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు...

డీఎస్పీ.మహబూబ్ బాషా ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులుల గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.క్యూలైన్ల ద్వారా భక్తులకు దర్శనాన్ని కల్పించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వేసవి దృష్ట్యా పలువురు దాతలు భక్తులకు మంచి నీటి సౌకర్యం కల్పించడంతో పాటు మజ్జిగ ప్యాకెట్లను అందజేశారు.

ఏకగ్రీవ ఎన్నిక



దంత వైద్యుల సంఘం నూతన కార్యవర్గం

కడప రూరల్ : దంత వైద్య సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా కడపకు చెందిన దంత వైద్యులు డాక్టర్ నిజాముద్దీన్ ఎన్నికయ్యారు. నంద్యాల పట్టణంలో జరిగిన దంత వైద్యుల సంఘం రాష్ట్ర స్థాయి సమావేశంలో ఏకగ్రీవంగా నిజాముద్దీన్‌ను ఎన్నుకున్నారు. అలాగే గౌరవాధ్యక్షులుగా గడ్డం రాజేష్ (కర్నూలు)లు ఎన్నుకున్నారు. తన నియామకానికి సహకరించిన సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన విద్యుత్ సౌకర్యం

రైల్వేకోడూరు : రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలకు, వ్యవసాయానికి మెరుగైన విద్యుత్ అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని బాలిపల్లె వద్ద నూతనంగా నిర్మించిన 33-11కెవి ఉపకేంద్రాన్ని ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు, సీఎం సలహాదారులు ధనుంజయరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడి మాట్లాడుతూ ఈ విద్యుత్ ఉపకేంద్రాల ఏర్పాటుతో లో వోల్టేజి, బ్రేక్‌డౌన్ లాంటి సమస్యలు లేకుండా పోతాయన్నారు. జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ముప్పాల హేమనవర్మ, చిట్వేలి మండల కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులరెడ్డి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి సీడీ.నాగేంద్ర, జెడ్పీటీసీ రత్నమ్మ, స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్లు మలిశెట్టి వెంకటరమణ, ముజీబ్, లింగం లక్ష్మీకరలు, మార్కెట్ కమిటిచైర్మన్ సుబ్బరామరాజు, వైస్ చైర్మన్ ఆదామ్‌సాహెబ్, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, ఉప సర్పంచ్ తోట శివసాయి, అంబటి మురళి, పూర్ణమ్మ, ఆర్‌వి.రమణ, జనార్దన్ రాజు, బండారు మల్లికార్జున పాల్గొన్నారు.



బాలిపల్లె వద్ద విద్యుత్ ఉపకేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే

విద్యా, వైద్యానికి సీఎం ప్రాధాన్యం

గాదెల తల్లెంవారిపల్లెలో పాఠశాల భవనాల ప్రారంభోత్సవంలో మంత్రి పెద్దిరెడ్డి



తల్లెంవారిపల్లె సభలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి



పాఠశాల భవనాల శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే

ఓబులవారిపల్లె : దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో విద్యా వైద్య రంగాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాధాన్యత ఇస్తున్నారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. సోమవారం గాదెల పంచాయతీ తల్లెంవారిపల్లె గ్రామంలో జెడ్పీ ఉన్నత పాఠశాల నూతన భవనం ,సచివాలయం రైతుభరోసా కేంద్రాలను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, సీఎం సలహాదారులు ఆర్. ధనుంజయరెడ్డి, కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, ఎస్పీ కృష్ణారావు ప్రారంభించారు. దాదాపు 24 కోట్ల రూపాయల నిధులతో ఈ అభివృద్ధి పనులు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి మాట్లాడుతు ఈ మారు మూల ప్రాంతాల అభివృద్ధికి సీఎం సలహాదారుడు ధనుంజయరెడ్డి కృషి చేయడం అభినందనీయమని అన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేద విద్యార్థులు కూడా మంచి చదువులు చదవాలనే ఉద్దేశంతో అమ్మఒడి, వసతి దివేన, విద్యా దీవెన,గోరుముద్ద, తదితర సంక్షేమ పథకాలకు కోట్లది రూపాయలు ఖర్చు చేస్తున్నారని అన్నారు. నాడు నేడుతో ప్రభుత్వ పాఠశాలలు రూపురేఖలు మార్చి పేదల పిల్లలు ఇంగ్లీష్ మీడియం విద్యను అందిస్తున్నారని అన్నారు. చంద్రబాబు నాయుడు అధికారంలోకి రావడనికి ప్రతి సారి మోసపూరిత మాటలు అబద్ధాలు చెబుతారని విమర్శించారు. 2014 ఎన్నికల్లో వంద హామీలు ఇచ్చి అధికారంలో వచ్చాక ఒక్కటైనా అమలు చేశాడా అని ప్రశ్నించారు. ఎంపీ మిథున్‌రెడ్డి మాట్లాడుతూ చిన్న వయస్సులోనే ధనుంజయరెడ్డి ముఖ్యమంత్రి సలహాదారుడిగా ఎదగడం .. తన సొంత గ్రామం అభివృద్ధి కోసం కృషి చేయడం హర్షనీయమని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మాట ఇస్తే అమలు చేస్తారని, చంద్రబాబు మాట ఇచ్చి మోసం చేస్తాడన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి వచ్చే ఎన్నికల్లో ఎంపీగా తనను ఎమ్మెల్యేగా కొరముట్ల శ్రీనివాసులును గెలిపించాలని కొరారు. ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతు గాదెల తల్లెంవారిపల్లె గ్రామంలో అత్యున్నత ప్రమాణలతో పేదలకు ఉన్నత పాఠశాల నిర్మించడం హర్షనీయమన్నారు. సీఎం సలహాదారు ధనుంజయరెడ్డి ప్రత్యేక నిధులతో తల్లెంవారిపల్లె గ్రామన్ని అభివృద్ధి చేశారని కొనియాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి , మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి, సహకారంతో కోట్లాది రూపాయల వ్యయంతో మంగంపేట కాలుష్య గ్రామాల తరలింపు, పునరావాసం కల్పిస్తున్నామన్నా రు. ముఖ్యమంత్రి సలహాదారులు ఆర్. ధనుంజయరెడ్డి మాట్లాడుతు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి సహకారంతో తల్లెంవారిపల్లె గ్రామంలో అభివృద్ధి పనులు చేశామన్నారు. కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ మాట్లాడుతు తను ఓబులవారిపల్లె మండలం ముక్కావారిపల్లెలో చదువకున్నానని గుర్తు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదవడం గర్వంగా భావించాలని విద్యార్థులకు సూచించారు. ఏపీటీడీసీ డైరెక్టర్ సాయికిషోర్‌రెడ్డి , ఎస్పీ కృష్ణారావు, ఏపీ స్కీల్ డెవెలప్‌మెంట్ చైర్మెన్ కొండూరు అజయ్‌రెడ్డి మాట్లాడారు. అంతక ముందు సచివాలయం,రైతు భరోసా కేంద్ర, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల,సిమెంటు రోడ్డును ప్రారంభించారు సినియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి, ఆర్‌జేడి రాఘవరెడ్డి, డీఈఓ శివప్రకాష్‌రెడ్డి, ఆర్‌డీఓ మోహన్‌రావు, పుల్లంపేట ఎంపీపీ ముద్దా బాబుల్‌రెడ్డి, ఎంపీపీ చీర్ల నాగమ్మ, రాష్ట్ర ప్రచార కార్యదర్శి సీడీ నాగేంద్ర, సర్పంచ్‌లు కృష్ణయ్య,ఎస్‌పీ జయపాల్‌రెడ్డి, జరుగు నారాయణరెడ్డి ,మల్లెం ఈశ్వరయ్య, గుంతకల్లు బోర్డు మెంబర్ తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి వైఎస్సార్ సీపీ నాయకులు ఓజీ శ్రీనివాసుల రెడ్డి, చిన్నిరెడ్డి ఆశోక్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రామకృష్ణయ్య, జెడ్పీటీసీ లక్ష్మీనరసయ్య, తహసీల్దార్ శేషగిరిరావు, మాజీ సర్పంచ్‌లు శ్రీధర్‌రెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ నుంచి భారీగా వైఎస్సార్‌సీపీలో చేరిక

గుర్రంకొండ : మండలంలోని శెట్టివారిపల్లె పంచాయతీ పరిధిలో పలు గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు, కుటుంబాల వారు భారీగా వైఎస్సార్‌సీపీలో చేరారు. సోమవారం పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, రాష్ట్ర ఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డిలు ఆయా గ్రామాల్లో పర్యటించారు.

ఈ సందర్భంగా స్థానిక మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ శెట్టివారి ప్రమీలమ్మ, పలు గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు శెట్టివారి చంద్రశేఖర్, కార్తిక్‌లతో పాటు 60 కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరందరికి ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పార్టీ కండువాలను కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, జగనన్న పథకాలను చూసి పలువురు పార్టీలోకి రావడం శుభపరిణామమన్నారు. పార్టీలో అందరు కష్టపడి పనిచేసే రాబోయే ఎన్నికల్లో జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీలు సమీన్ ముక్తియార్, ఉదయ్‌కుమార్, మండల ఆర్బీకే చైర్మన్ జయచంద్రారెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ నక్కా చంద్రశేఖర్, మండల సచివాలయాల కన్వీనర్ నాగేంద్ర, మాజీ ఎంపీపీ జమీర్, మండల ప్రత్యేక ఆహ్వానితుడు కందుల గుణశేఖర్, అప్పల్ల, ఎల్వీ రమణ, చంద్రశేఖర్ తరిగొండ ప్రకాష్‌రెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ నీళ్ల శ్రీనివాసులు, రెడ్డికుమార్, సర్పంచ్‌లు యల్లారెడ్డి, విశ్వనాథ్, జగన్మోహన్, ఎంపీటీసీలు గంగులమ్మ, సరస్వతి, నాయకులు రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, సురేష్, రామ్‌ప్రకాష్‌రెడ్డి, సూరి పాల్గొన్నారు.



గుర్రంకొండ మండలం శెట్టివారిపల్లె గ్రామం నుంచి పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు

గాంధీబజారులో 50 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక

రాయచోటి అర్బన్ : పట్టణంలోని గాంధీబజారుకు చెందిన ఎంఎస్ జ్యువెలర్స్ యజమాని హమీమ్‌తో పాటు మరో 50 కుటుంబాల వారు తెలుగుదేశం పార్టీని వీడి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో ఇషాక్, అంజి, మహమ్మద్ అలీ, శ్రీను, గణేష్, మహమ్మద్, షరీఫ్, జాఫర్‌అలీ, జయరాం, షాహీర్, సలీం, ఫాజిల్, ఉమర్, మహమ్మద్ తదితరులు ఉన్నారు.

బడేకరీమియా మసీదు వీధిలో 50 కుటుంబాలు..

పట్టణంలోని బడేకరీమియా మసీదు వీధిలో 50 కుటుంబాల వారు టీడీపీని వీడి ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో మోపాలకుంట చాన్‌బాషా, జావీద్‌బాషా, ఉమర్‌బాషా, మౌలానా, గఫూర్, అబీద్, నజీర్, ఫాజిల్, కరీముల్లా, సమీవుల్లా, షౌకత్, చోటా, షరీఫ్, అష్రఫ్, సహదేవ, బాబా, చోటు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లతో పాటు పలువురు మైనార్టీ నేతలు పాల్గొన్నారు.



బడేకరీమియా వీధిలో వైఎస్సార్‌సీపీలో చేరిన మైనార్టీ కుటుంబాలు

చిట్టీల పేరుతో మోసం

- రూ.4కోట్లకు పైగా చెల్లించాల్సి ఉందని గగ్గోలు
- న్యాయం చేయాలంటూ పోలీసులను ఆశ్రయించిన బాధితులు



చిట్టీల నిర్వాహకుడి చేతిలో మోసపోయామంటూ వన్‌టౌన్ స్టేషన్ ఎదుట బాధితుల నిరసన

మదనపల్లె : పట్టణంలో ప్రైవేట్‌గా చిట్టీలు నిర్వహిస్తున్న వ్యక్తులు తమను మోసం చేశారంటూ బాధితులు వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించిన ఘటన సోమవారం జరిగింది. బాధితులు పోలీసులకు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని కజిన్స్ వీధికి చెందిన వి.రెడ్డెప్పరెడ్డి కుమారుడు వి.సుధాకర రెడ్డి వీఎస్ఆర్ ఏజెన్సీ, చిట్స్, ఫైనాన్స్ వ్యాపారాలు నిర్వహిస్తున్నాడు. 20 ఏళ్లుగా నమ్మకంగా చిట్టీలు నడుపుతుండటం, చిట్టీలు వేసిన వారికి సమయంలో డబ్బులు చెల్లించడం చేస్తుండటంతో చాలామంది ఆయన వద్ద చిట్టీలు వేశారు. ఈ క్రమంలో మూడున్నరేళ్లుగా నడుస్తున్న చిట్టీలకు సంబంధించి పాడుకున్న వారికి కొంత మొత్తం చెల్లించి, మిగిలిన వారికి డబ్బులు చెల్లించకుండా కాలయాపన చేస్తున్నాడు. దీనిపై ఫిబ్రవరి 27న సుధాకరరెడ్డి ఇంటికి వెళ్లి చిట్టీ డబ్బులు ఇవ్వాలని కోరితే దుర్భాషలాడుతూ, తాను ఎవ్వరికీ డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదని, చిట్టీల డబ్బులు వసూలు చేసిన కృష్టారెడ్డిని అడగాలని చెప్పాడు. ఈ విషయమై వీరు తమ వద్ద చిట్టీ డబ్బులు వసూలు చేసిన కృష్టారెడ్డిని విచారిస్తే...అనంతపురం జిల్లా నల్లమాడ మండలం సానేవారిపల్లెకు చెందిన తాను 2001లో మదనపల్లె వీఎస్ఎన్ ఎంటర్‌ప్రైజెస్ యజమాని సుధాకరరెడ్డి వద్ద పనిచేసేందుకు వచ్చినట్లు తెలిపాడు. నెలకు రూ.22,000 జీతంతో చిట్టీలకు సంబంధించిన కలెక్షన్లు వసూలు చేయాల్సిందిగా పురమాయించాడని తెలిపాడు. ఈ క్రమంలో వ్యాపారం బాగా జరగడంతో మెల్లమెల్లగా 4 చిట్టీల నుంచి 24 గ్రూపుల వరకు పెంచుకుంటూ వెళ్లామన్నాడు. వీటిద్వారా నెలకు రూ.6లక్షల వరకు ఆదాయం వచ్చేదన్నాడు. 2018 నుంచి యజమాని సుధాకరరెడ్డి గ్రూపులు తగ్గించుకుంటూ రావాల్సిందిగా చెప్పి 2023కి పదిగ్రూపులకు తగ్గించాడని తెలిపాడు. చిట్టీల వాళ్లను తన వద్దకు రానివ్వకుండా, నీవే కలెక్షన్లు, పేమెంట్స్ చూసుకోవాలని చెప్పాడన్నారు. అయితే కరోనాలో చిట్టీలు వేసిన వారిలో కొంతమంది చనిపోవడం, మరికొందరు వ్యాపారాలు జరగక, స్వస్థలాలకు, ఇతర ప్రాంతాలకు వలసవెళ్లడం జరిగిందన్నారు. దీంతో చిట్టీల డబ్బులు వసూలుకాక, ఇవ్వాల్సిన వాళ్లకు ఇవ్వలేక ఒత్తిడి పెరిగిందన్నారు. ఈ క్రమంలో చిట్టీలు వేసిన వాళ్లు సుధాకరరెడ్డిని అడిగితే...చిట్టీలకు తనకు సంబంధం లేదని, కృష్టారెడ్డికే సంబంధమని, తాను ఎప్పుడో చిట్టీల వ్యాపారం మానేశానని చెప్పుకుంటూ, బాధితులను తనపైకి మళ్లించాడన్నారు. దీంతో వారు తనను నిలదీస్తే... శుక్రవారం బాధితులతో కలిసి ఆయన ఇంటివద్దకు వెళ్లామన్నారు. సుధాకరరెడ్డి తరపున రెడ్డెప్ప వచ్చి ఈనెల 25న డబ్బులు ఇస్తామని చెప్పాడన్నారు. అయితే కొన్ని పత్రికల్లో కృష్టారెడ్డి చిట్టీలు వేసిన వారికి శఠగోపం పెట్టాడని వార్తలు రావడంతో, బాధితులందరూ ఏకమై స్టేషన్‌కు వచ్చామని, నేటికీ తాను రూ.22,000 జీతానికి సుధాకరరెడ్డి వద్ద పని చేస్తున్నానే తప్ప, తనకు చిట్టీడబ్బులకు ఎలాంటి సంబంధం లేదని, పోలీసులకు రాతపూర్వకంగా ఫిర్యాదుచేశాడు. దీనిపై వీఎస్ఆర్ సుధాకరరెడ్డి మాట్లాడుతూ.. కృష్టారెడ్డి తన చిన్ననాటి మిత్రుడు, బంధువు కావడంతో తనవద్దే నమ్మకంగా ఉంటాడని భావించి పనిలో పెట్టుకున్నానన్నారు. 20 ఏళ్లుగా అతడు తన వద్ద పనిచేస్తున్నది, చిట్టీల కలెక్షన్ ఏజెంట్‌గా పెట్టుకున్నది వాస్తవమేనన్నారు. అయితే..2018లో ఇతర వ్యాపారాలతో బిజీగా ఉండటంతో చిట్టీలు మానేయాలని నిర్ణయించుకుని ఇవ్వాల్సిన వారందరికీ చెల్లింపులు చేయడం జరిగిందన్నారు. ఈక్రమంలో తన వద్ద పనిచేసిన కృష్టారెడ్డి గతంలో కలెక్షన్ ఏజెంట్‌గా ఉన్న సమయంలో కలిగిన పరిచయాలతో, మాటమాత్రమైనా చెప్పకుండా చిట్టీలు నడుపుతూ వచ్చాడన్నారు. ఈ విషయం తనకు తెలియదని, అతడి వద్ద చిట్టీలు వేసిన వారు తనను సంప్రదించలేదన్నారు. కరోనాలో అతడి భార్య మరణించడం, ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతూ, చిట్టీల వ్యాపారంలో నష్టపోయానని, స్నేహితుడిగా ఆదుకోవాల్సిందిగా తనను కోరాడన్నారు. దీంతో సరేనని, బాధితులని పిలిపించి మాట్లాడుదామని చెపితే, వ్యవహారం మొత్తాన్ని తనపైకి నెట్టేసి, తాను కేవలం చిరుద్యోగినని చెప్పుకుంటూ తన ప్రతిష్టకు మచ్చతెచ్చేలా వ్యవహరిస్తున్నాడన్నారు. దీనిపై తాను న్యాయపరంగా ముందుకెళతానని, తనకు చిట్టీల నిర్వాహకుడు కృష్టారెడ్డికి, చిట్టీలు వేసిన బాధితులకు ఎలాంటి సంబంధం లేదని చెప్పుకొచ్చారు. అయితే బాధితులు తమకు రూ.4కోట్లకు పైగా డబ్బులు రావాల్సి ఉందని, పోలీసులు న్యాయం చేయాల్సిందిగా ఫిర్యాదు చేశారు.



వైఎస్ జగన్ సీఎంగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. నెలల తరబడి తిరిగినా లభించని సర్టిఫికెట్లు నేడు జగనన్న సురక్ష ద్వారా సత్వరమే అందుతున్నాయి. నాడు – నేడుతో సర్కారు బడుల రూపు రేఖలు మారిపోయాయి. – సాక్షి నెట్‌వర్క్

సొంతింటి కల నెరవేరింది



మాకు సొంత ఇల్లు లేక బాడుగ ఇంట్లో జీవనం గడిపేవాళ్లం. మా పిల్లలను చదివించుకుంటూ బాడుగలు కట్టాలంటే చాలా ఇబ్బందులు పడేవాళ్లం. గత ప్రభుత్వంలో ఇంటి కోసం అర్జీ పెట్టుకున్నా మంజూరు చేయలేదు. సొంత ఇల్లు కట్టుకోవాలంటే స్థలానికి డబ్బులు పెట్టికొని మరలా ఇల్లు ఎప్పుడు కట్టుకోవాలనే చింత ఉండేది. రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన వచ్చాక మాకు సిద్ధవటం లోని జగనన్న కాలనీలో ఇల్లు మంజూరు చేశారు. అక్కడ ఇల్లు కట్టుకుంటున్నాము, నాకు సొంత ఇల్లు అనేది ఉండటంతో దిగులు పోయింది. చాలా సంతోషంగా ఉన్నాము.

-షేక్ సల్మా, దిగువపేట, మెయిన్ బజార్, సిద్దవటం

రూపాయి ఖర్చు లేకుండా ధ్రువీకరణ పత్రాలు



రూపాయి ఖర్చు లేకుండా ధ్రువీకరణ పత్రాలు వచ్చాయి. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అవసరమైన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు సచివాలయంలోనే ఇస్తున్నట్లు మా వలంటీర్ చెప్పడంతో దరఖాస్తు చేసుకున్నాను. దరఖాస్తు చేసుకున్న రెండు, మూడు రోజుల్లోనే ధ్రువీకరణ పత్రాలు వచ్చినట్లు వలంటీర్ ద్వారా తెలిసింది. స్థానిక సచివాలయానికి వెళ్లి పత్రాలు తెచ్చుకున్నాము. గతంలో ధ్రువీకరణ పత్రాలు కావాలంటే మండల కేంద్రానికి వెళ్లి రోజుల తరబడి తిరిగితే గాని వచ్చేవి కావు. జగనన్న ప్రభుత్వంలో వలంటీర్ ద్వారా అన్ని పథకాలు ఇంటి వద్దకే వస్తున్నాయి. ధ్రువీకరణ పత్రాలు కూడా ఇంటి వద్దకే రావడంతో మేము ఎప్పుడూ సీఎంకు రుణపడి ఉంటాం.

- మున్నెళ్లిలక్ష్మీదేవి, కాలువపల్లె, గోపవరం మండలం

చిత్రలేఖనం పోటీల్లో బంగారు పతకాలు



బంగారు పతకాలు సాధించిన విద్యార్థులతో ఆర్ట్ మాస్టర్ ఆనంద్‌రాజు

రామాపురం : మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు విజయవాడలో జరిగిన జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీలలో పది మంది విద్యార్థులు బంగారు పతకాలు సాధించినట్లు ఆర్ట్ మాస్టర్ ఆనంద్‌రాజు, ప్రిన్సిపాల్ వరప్రసాద్ తెలిపారు. ఆదివారం విజయవాడలో డ్రీమ్స్ చిల్డ్రన్స్ ఆర్ట్స్ అకాడమీ, అనంత డైమండ్స్ సంయుక్తంగా జాతీయ స్థాయి పోటీలు నిర్వహించారు. విజయవాడ ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ లక్ష్మీకాంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై వీరికి పతకాలు బహూకరించారు.

ఎర్రబల్లిలో భారీ చోరీ

రాజంపేట : పట్టణంలోని ఎర్రబల్లిలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. ఇంటి యజమాని సయ్యద్ ఫాతిమా బాను ఫిర్యాదు మేరకు మన్నూరు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఇంటి యజమాని ఆసుపత్రికి వెళ్లిన సమయంలో ఈ సంఘటన జరిగింది. వంద గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.1,70,000 నగదు చోరీకి గురైనట్లు బాధితురాలు పేర్కొంది.

గుర్తు తెలియని వ్యక్తి ఆసుపత్రికి తరలింపు



చికిత్స పొందుతున్న గుర్తుతెలియని వ్యక్తి

మదనపల్లె : పట్టణంలోని చౌడేశ్వరి కళ్యాణ మండపం వద్ద సోమవారం సాయంత్రం ఓ గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. 108కు సమాచారం అందించారు. 108 సిబ్బంది వెంటనే అక్కడకు చేరుకుని బాధితున్ని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో చికిత్స అందిస్తున్నారు. అతని కుటుంబ సభ్యులు ఎవరైనా ఉంటే జిల్లా ఆస్పత్రిలో సంప్రదించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో సంఘ సేవకుడు మృతి



శరత్(ఫైల్‌ఫొటో)

రాజంపేట : రాజంపేట వాసవీ సహృదయ ట్రస్ట్ సేవాసమితిలో సభ్యుడిగా ఉన్న రాజా శరత్(40) ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. బైపాస్‌లోని ఎన్‌కేఎన్ కళ్యాణమండపం సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ప్రాంతీయవైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా శరత్ మృతదేహాన్ని జెడ్పీచైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి, రాజంపేట మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి సందర్శించి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వీరి వెంట డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దండుగోపి, జెడ్పీటీసీ దాసరి పెంచలయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు డీలర్ సుబ్బరామిరెడ్డి, సౌమిత్రి, శంకరశెట్టి, శేఖర్ ఉన్నారు. అలాగే రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి శరత్‌మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే వెంట నాయకులు కుందా నెల్లూరు వెంకటేశ్వరరెడ్డి, ఉమామహేశ్వరరెడ్డి, కౌన్సిలర్ నవీన్‌శెట్టి, రాజంపేట రూరల్ జేసీసీఏ కన్వీనర్ మందరం గంగిరెడ్డి, పాలగిరి మల్లికార్జునరెడ్డి, అవినాష్, ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గాయపడిన వ్యక్తి మృతి

మదనపల్లె : రైలు ఢీకొని తీవ్రంగా గాయపడిన వ్యక్తి మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. తంబళ్లపల్లి మండలం కన్నెమడుగు పంచాయతీ మల్కివారిపల్లెకు చెందిన కన్నె మడుగు రెడ్డప్ప (55) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ తీవ్ర ఇబ్బందులు పడేవాడు. ఆదివారం కురబలకోట రైల్వే స్టేషన్ సమీపంలో మెల్లగా కదులుతున్న రైలు కింద పడి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతన్ని స్థానికులు వెంటనే 108 వాహనంలో మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఐసీయూలో చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం మృతి చెందాడు.

ప్రజా ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యత : ఏఎస్పీ

రాయచోటి : స్పందన ద్వారా ప్రజలు అందించే ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని ఏఎస్పీ వీబీ రాజ్ కమల్ ఆదేశించారు. సోమవారం అన్నమయ్య జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి ఏఎస్పీ ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లా స్పందనకు 29 ఫిర్యాదులు అందినట్లు ఆయన తెలిపారు.

దాడి కేసులో నిందితుడి అరెస్టు

పెద్దమండ్యం : కత్తితో దాడి చేసిన యువకుని సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ చెన్నకేశవ తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పెద్దమండ్యం పంచాయతీలోని బురుజుకురవపల్లెకు చెందిన కావలి లక్ష్మీపతి (26) పై ఇతనికి స్వయానా బామ్మర్ది అయిన గెలసంవారిపల్లెకు చెందిన బాలే శ్రీకాంత్ (19) కత్తితో దాడి చేసిన విషయం తెలిసిందే. బాధితుడి తల్లి కావలి భూదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. నిందితుడిని గెలసంవారిపల్లె వద్ద అరెస్ట్ చేసి, అతను ఉపయోగించిన కత్తిని, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సోమశిల బ్యాక్ వాటర్ ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన

- చెరువులో నీటిని నింపేందుకు రూ. 215.25 కోట్లు మంజూరు
- ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ అజయ్‌రెడ్డి వెల్లడి



ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొరముట్ల, స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ అజయ్‌రెడ్డి

పెనగలూరు (ఓబులవారిపల్లె) : సోమశిల బ్యాక్ వాటర్‌ను పెనగలూరు, చిట్వేలి మండలాలలో చెరువులలో నింపేందుకు ఎత్తిపోతల పథకానికి సోమవారం సింగనమల చెరువుకట్ట వద్ద ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డిలు శంకుస్థాపన చేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ సోమశిల బ్యాక్ వాటర్ నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా పెనగలూరు, చిట్వేలి మండలాల్లోని చెరువులలో నీటిని నింపేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రూ. 215.25 కోట్లు నిధులను మంజూరు చేశారన్నారు. ఈ ఎత్తిపోతల పథకానికి అన్ని అనుమతులు లభించాయన్నారు. పెనగలూరు మండలంలోని ప్రతి చెరువుకు, చిట్వేలి మండలంలోని ఎల్లమరాజు చెరువు వరకు అన్ని చెరువులలో నీటిని నింపడం ఈ పథకం లక్ష్యమన్నారు. గత ఏడాది కాలంగా ఈ ఎత్తిపోతల పథకం మంజూరు కోసం ఎంపీ మిథున్ రెడ్డితోపాటు తాము కూడా ముఖ్యమంత్రిని అనేకసార్లు కలిసి ఈ విషయంపై వివరించామన్నారు. ముఖ్యంగా మారుమూల ఉన్న గోవిందంపల్లి చెరువుకు కూడా ప్రత్యేకంగా పైపులైన్ వేసి నీటిని నింపుతామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతుల మేలు కోరే ప్రభుత్వమని వారన్నారు. ఈ కార్యక్రమంలో సింగనమల సర్పంచ్ శివ కుమార్, వైఎస్సార్‌సీపీ కోడూరు నియోజకవర్గ అధ్యక్షుడు ధ్వజారెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఎర్రి నరసింహులు, ముదిరాజ్ సంఘం రాష్ట్ర డైరెక్టర్ గుండ్లూరు ఈశ్వరయ్య, చిట్వేలి మండల వైఎస్సార్‌సీపీ నాయకులు ఎల్‌వి మోహన్ రెడ్డి, గుండ్లూరు శంకరయ్య, జెడ్పీటీసీ సుబ్బరాయుడు, ఎంపీటీసీ సభ్యుడు షేక్ సహబుద్దీన్, వెంకటేశు, వ్యవసాయ సలహామండలి మండలాధ్యక్షుడు శ్రీనివాసులు రెడ్డి, గుండాల్ రెడ్డి, సాతుపల్లి సుబ్బారెడ్డి, వెంకటరెడ్డి, ఇరిగేషన్ శాఖ అధికారులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కేతా చక్రపాణి, సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

రాయచోటి : జగనన్నకు చెబుదాం–స్పందన కార్యక్రమంలో అందిన ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపకుండా లబ్ధిదారులకు నాణ్యమైన పరిష్కారం అందించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జేసీ, డీఆర్‌ఓ సత్యనారాయణలు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు, క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. నిర్ణీత గడువులోపు అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలని ఆదేశించారు.

స్పందనలో విజ్ఞప్తులు..

రైల్వేకోడూరు మండలం, సూరపురాజుపల్లికి చెందిన ఎస్.చంటి తనకుమారుడు అంకవైకల్యంతో బాధపడుతున్నాడని, సదరం సర్టిఫికెట్ జారీ చేయించాలని జాయింట్ కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు. అన్నమయ్య జిల్లా చేనేత కార్మికుల సంఘం వారు జిల్లాలో కొంతమంది చేనేత కార్మికులకు జనవరి మాసం నుంచి పెన్షన్లు ఆగిపోయాయని జేసీ దృష్టికి తెచ్చారు. మదనపల్లి మండలం, కురవవంక గ్రామానికి చెందిన షేక్ జబీనా తనకు భర్త లేడని, 9 సంవత్సరాల పాప కూడా మరణించిందని, పాచి పనులు చేసుకుని జీవనం గడుపుతున్నానని, జీవనాధారం నిమిత్తం అంగన్ వాడీ స్కూల్ ఆయాగా మంజూరు చేయించాలని కోరారు. పలువురు అధికారులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొని ముగ్గురికి గాయాలు

మదనపల్లె : ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొని ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం బి.కొత్తకోట మండలంలో జరిగింది. మొరంమీదపల్లెకు చెందిన వెంకటేశ్వర రెడ్డి (35), బలకవారిపల్లెకు చెందిన మల్లికార్జున (40) భవన నిర్మాణ కార్మికులుగా పనిచేస్తున్నారు. సోమవారం పనులు చేసేందుకు ఇద్దరు కలిసి ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా, మార్గమధ్యంలోని మద్దిరెడ్డిచెరువు వద్ద మదనపల్లి భువనేశ్వరి నగర్‌కు చెందిన ఉపాధ్యాయుడు రామయ్య(46) మరో ద్విచక్ర వాహనంలో బాల్‌రెడ్డిగారిపల్లె పాఠశాలకు వెళుతూ వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నాడు. ప్రమాదంలో రెండు ద్విచక్ర వాహనాల్లోని ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. గమనించిన స్థానికులు వారిని 108 వాహనంలో మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు.

6 ఎర్రచందనం దుంగలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న దుంగలు, నిందితునితో అటవీశాఖ అధికారులు

రైల్వేకోడూరు అర్బన్ : కోడూరు రేంజ్ పరిధిలోని గాదెల అటవీ ప్రాంతంలో అక్రమంగా తరలిస్తున్న 6 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేసినట్లు సోమవారం కోడూరు ఎఫ్ఆర్‌ఓ రఘునాథరెడ్డి తెలిపారు. గాదెల అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తుండగా కొంత దూరంలో ఎర్రచందనం దుంగలను తరలిస్తున్నట్లు గుర్తించి సంఘటనా స్థలానికి వెళ్లామన్నారు. స్మగ్లర్లపై దాడి నిర్వహించి ఆరు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, తమిళనాడు రాష్ట్రం తిరున్నామలైకు చెందిన వెంకటేశ్‌ను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. దుంగల విలువ రూ.53వేలు ఉంటుందన్నారు. వారి వద్ద నుంచి రెండు గొడ్డళ్లు,ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నామన్నామన్నారు. ఈ దాడుల్లో అటవీశాఖ అధికారులు మహేష్‌కుమార్, దేవేంద్రరెడ్డి, నాగేశ్వరనాయక్ పాల్గొన్నారు.

